ప్రజాశక్తి
సోమవారం 1, జనవరి, 2024 5
శ్రీ సత్యసాయి



నూతన సంవత్సర శుభాకాంక్షలు : కలెక్టర్



ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలియజేశారు. 2023వ సంవత్సరంలో ఎదురైన చేదు జ్ఞాపకాలను చెరిపివేసి 2024 నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రజలు అందరూ తమ తోటి వారితో సామరస్యంగా, స్నేహభావంతో మెలగాలన్నారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సకల సంపదలు కలగాలని కోరుకున్నారు. జిల్లా అధికార యంత్రాంగం 2023లో తమకు ఎదురైన సవాళ్లను అధిగమించి నూతన సంవత్సరంలో జిల్లాను అభివద్ధి బాటలో నడిపించేందుకు తమ వంతు కషి చేయాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి ఒకటో తేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పుట్టపర్తి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉండనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



పుట్టపర్తి నగర పంచాయతీ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం నాటికి సమ్మె చేపట్టి 6వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వార్త 6లో

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



చిలమత్తూరులో దీక్షా శిబిరం వద్ద కబడ్డీ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం నాటికి సమ్మె 20వ రోజుకు చేరుకుంది. ఆయా దీక్షా కేంద్రాల వద్ద అంగన్‌వాడీలు క్రీడా పోటీలు ఆడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫొటోలను ధరించి కబడ్డీ ఆడారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబించడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు.

వార్త 6లో

'న్యూ'తన సందడి

కాలగమనంలో మరో సంవత్సరం కలసిపోయింది. 'కొత్త' ఆశలు మొలకెత్తాయి. ఆకాంక్షలు ఊగిసలాడాయి. వ్యాపకాలు దారి మార్చుకున్నాయి. సాధ్యాసాధ్యాలను పక్కనబెడితే మనసు కొత్త ఉత్సాహంతో సందడి చేసింది. కొత్త కాంతులు.. కోటి ఆశలతో 'న్యూ'తనోత్సహం నెలకొంది. 2023కు వీడ్కోలు పలుకుతూ 2024కు స్వాగతం పలుకుతూ అందరిలోనూ జోష్ కనిపించింది. గతేడాది కష్టాలు ఒక జ్ఞాపకంగా వదిలేసి... ఆశల అడుగులు ఆగకుండా గుండెనిండుగా 2024కు ఉమ్మడి జిల్లా వాసులు స్వాగతం పలికారు.

- కొత్త ఆశలతో 2024కు స్వాగతం
- రోడ్లపై యువత ఆనంద హేల
- ప్రత్యేక ఆకర్షణలో బహుమతులు
- ఆకట్టుకుంటున్న పూల బొకేలు
- నోరూరించేలా స్వీట్ ప్యాక్‌లు







ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023 సంవత్సరంలోని చేదు,తీపి జ్ఞాపకాలకు వీడ్కోలు పలుకుతూ 2024కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్వాగతం పలికారు. పాతేడాదికి వీడ్కోలు.. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం నాడు అర్ధరాత్రి వరకు వేడుకలు జరిగాయి. నూతన సంవత్సర వేడుకలను సంబరంగా జరుపుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. నగరాలు, పట్టణాల్లో హోటళ్ళు, బేకరీలు, స్వీట్ షాపులు పెద్దఎత్తున అలకరించబడ్డాయి. ఆఫర్లు సైతం పెద్దఎత్తున ప్రకటించారు. కొన్ని సంస్థలైతే నూతన సంవత్సరం వేడుకలను పురష్కరించుకుని ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించాయి. స్నేహితులు, సన్నిహితులు వారికి అనువైన ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు వేడుకలు జరుపుకుని కేక్‌లను 12 గంటల సమయంలో కట్ చేసుకుని నూతన సంవత్సరం శుభకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో అన్ని ప్రధాన పట్టణాల్లోనూ అర్ధరాత్రి వరకు సందడి నెలకొంది.

కలసిరాని 2023

2023 సంవత్సరం పెద్దగా కలసిరాలేదు. ప్రకృతి పరంగా చూసుకున్నా.. అభివృద్ధి పరంగా చూసుకున్నా సామాన్యులు ఇబ్బందులనే ఎదుర్కొన్నారు. 2022లో అధిక వర్షాలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతే 2023 సంవత్సరం వర్షాభావం వ్యవసాయాన్ని కుదేలే చేసింది. 30 శాతానికిపైగా రెండు జిల్లాల్లోనూ వర్షాభావం నెలకొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 49 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ కరువు ప్రభావం నూతన సంవత్సరం 2024లోనూ కొనసాగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సాగునీరు కూడా ఈసారి తక్కువగా రావడంతో ఆయకట్టు కింద సాగు చేసిన మిర్చి రైతులకు నూతన సంవత్సరంలోనూ సమస్యలు ఎదుర్కొనే పరిస్థితులే కనిపిస్తున్నాయి.

రాజకీయ వేడి

నేడు మొదలయ్యే 2024 సంవత్సరంలో ఎన్నికలు రానున్నాయి. ఈ ప్రభావం 2023 ఆఖరు నుంచే మొదలైంది. రాబోయే ఎన్నికలు కొన్ని నెలలు మాత్రమే ఉండటంతో గడిచిన రెండు, మూడు మాసాలుగా రాజకీయ వాతవరణం వేడెక్కి ఉంది. ఇక ఈ రోజుతో ఇవి మరింత వేగం పుంజుకునే అవకాశాలున్నాయి. ఇక నెలల నుంచి రోజుల్లోకి ఎన్నికల సమయం లెక్కించాల్సి ఉంటుంది. 2024 సంవత్సరం మాత్రం కొంత మంది రాజకీయ నాయకుల భవితవ్యాన్ని నిర్ధేశించనుంది. రాజకీయ నేతలతో ఈ సంవత్సరం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న సంవత్సరం కానుంది. ఇక ఎన్నిలకు దగ్గరపడుతున్న కొద్ది కార్మిక పోరాటాలు పెరుగుతున్నాయి. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున పోరాటాలకు దిగారు. ఆదా నేటితో మరింత పదునెక్కనున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏ రకంగా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

పాల ఉత్పత్తులతో లాభం

పాడి రైతులకు ప్రోత్సాహం

జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఆర్.కృష్ణానాయక్



కృష్ణానాయక్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'పాడి పరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. పాల ఉత్పత్తుల ద్వారా రైతులకు ఎంతో లాభం చేకూరుతుంది.' వ్యవసాయానికి పాడి పరిశ్రమ అనుసంధానం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ వారికి తగిన చేయూతనిస్తూ, పాడి పరిశ్రమ అభివద్ధికి కషి చేస్తోంది. గతంలో పాలకు తగిన మార్కెటింగ్ సౌకర్యం లేక కేవలం గ్రామంలో లేదా సమీప పట్టణాలకు వెళ్లి పాలు అమ్ముకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం డైయిరీ అభివద్ధి సంస్థ ప్రభుత్వం అనుసంధానంతో అమూల్ పరిశ్రమకు నేరుగా పాలను విక్రయించుకునే అవకాశం ఉంది. గ్రామాల్లో పాల ఉత్పత్తుల సొసైటీలు ఏర్పాటు చేసుకుని తద్వారా పాల ఉత్పత్తులను అమూల్ డైయిరీ కంపెనీ కొనుగోలు చేస్తుంది. ఎడిసిసి బ్యాంకులో దీర్ఘకాలిక సల్పకాలిక రుణాలు పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది'. అనిజిల్లా డైయిరీ కో-ఆపరేటివ్ అధికారి ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న:జిల్లాలో ఎన్ని గ్రామాల నుంచి పాలను సేకరిస్తున్నారు? వివరాలు తెలపండి.?

జవాబు: ప్రస్తుతం జిల్లాలో 7 మండలాల నుంచి 127 గ్రామాల్లో 27 వేల లీటర్ల పాలను అమూల్ సంస్థ సేకరిస్తోంది. కదిరి, తలపుల, ఎన్‌పి.కుంట, గాండ్లపెంట, ఒడిసి, నల్లచెరువు, తాడిమర్రి మండలాల నుంచి పాలను సేకరిస్తున్నాం. త్వరలో చిలమత్తూరు, పరిగి, లేపాక్షి, హిందూపురం మండలాల్లోని గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.



ప్రశ్న:పాల సేకరణ, వాటి పర్యవేక్షణ వివరాలు తెలపండి?

జవాబు: పాల ఉత్పత్తి పరస్పర సహకార సంఘాలు ఉంటాయి. ఆ సంఘాలతో పాటు తాము పశుసంవర్ధక శాఖ అధికారులు పర్యవేక్షిస్తుంటాం. ప్రస్తుతం జిల్లాలో 40 సొసైటీలు ఉన్నాయి. అందులో మహిళలే నాయకత్వం వహిస్తుంటారు. అమూల్ కంపెనీ ప్రతినిధులు ఆయా గ్రామాల సహకార పాల సొసైటీ ద్వారా పాలను రోజు సేకరిస్తుంటారు. వెన్న శాతం బట్టి ధరలు ఉంటాయి. ఆవు పాలు అయితే 30 నుంచి 50 వరకు లీటర్ పాలకు ధర చెల్లిస్తారు. అదే గేదె పాలు అయితే 40 నుంచి 50 వరకు లీటర్ పాలుకు చెల్లిస్తారు. పది రోజులకు ఒకసారి లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తారు. సేకరించిన పాలను బల్క్ మిల్క్ కేంద్రాలకు చేరవేస్తారు. మదనపల్లి, తిరుపతిలో ఈ కేంద్రాలు ఉంటాయి.

ప్రశ్న:-మీ శాఖ పరంగా రైతులకు మీరు అందిస్తున్న సహకారం ఏమిటి?

జవాబు: కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తాం. బ్యాంకు రుణాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులకు భూమి ఉంటే బ్యాంకులు తనఖా పెట్టుకుని ఎల్‌టి రుణాలు 4 నుంచి 5 లక్షల రూపాయల వరకు రుణాలు సబ్సిడీపై అందిస్తారు. అదే సల్ప కాలిక రుణాలు అయితే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు బ్యాంకు రుణాలు ఇస్తాయి. పశుసంవర్ధక శాఖ వైద్యుడు ధ్రువీకరణ పత్రం రైతులకు అందాల్సి ఉంది. ఎలాంటి మోసాలు లేకుండా తమ పాల ఉత్పత్తులను విక్రయించుకోవచ్చు. దానిక్కూడా సబ్సిడీపై అందిస్తాం.

ప్రశ్న:రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి? సిబ్బంది కొరత ఉందా?

జవాబు:పాడి పరిశ్రమకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మహిళా రైతు సొసైటీల ద్వారా మరింత అభివద్ధి చెందాలని కోరుకుంటుంది. సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు తాము సంయుక్తంగా పర్యవేక్షిస్తుంటాం

ముదిగుబ్బ ఎంపీడీవోగా కవిరాజ్

ప్రజాశక్తి ముదిగుబ్బ

ముదిగుబ్బ ఎంపిడిఒగా కవిరాజ్ బాధ్యతలు స్వీకరించారు. చదువు ముందు అంగవైకల్యం చిన్నదే అని ఈయన నిరూపించారు బెలుగుప్ప మండలానికి చెందిన కవిరాజ్ కనేకల్లులో 11 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తించారు. 2023 గ్రూప్ వన్ పరీక్షల్లో ప్రతిభ కనపర్చి ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఆయన ముదిగుబ్బలో ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్నారు ఈ సందర్భంగా కవిరాజ్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈసందర్భగా వైసిపి మండల కన్వీనర్ సివి. నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ భాస్కర్, పొడరాల్లపల్లి సర్పంచి నాగభూషణ ఎంపిడిఒను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం 3 సెక్రటరీ విశ్వనాథ్, ఎంపీడీవో తల్లిదండ్రులు, సిబ్బంది రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐఐయు జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్ డిమాండ్ చేశారు. 12వ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈసమ్మెలో పాల్గొన్న ఇంతియాజ్ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవటం దుర్మార్గమన్నారు. ఈ నేపథ్యంలో సమ్మెను మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఇంతవరకు కనీస వేతనం , పనికి తగ్గ సమాన వేతనం , ఉద్యోగ భద్రత , ఆరోగ్య భద్రత ప్రభుత్వం కల్పించకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్ఎస్ఎ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జేఏసీ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, వెంకటరమణ, రవి, నాగరాజు, ఓబులేసు జనసేన జిల్లా నాయకులు పత్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్

చరిత్ర పరిశోధనకు యువత ముందుకురావాలి

సిడబ్ల్యూసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

నాటి రాజుల చరిత్రను నేటి నాయకులు మార్గదర్శకంగా తీసుకొని ప్రజలకు ఆదర్శ పాలన అందించాలని , యువత చరిత్ర పరిశోధనకు ముందుకు రావాలని మాజీ మంత్రి, సిడబ్ల్యూసి సభ్యులు ఎన్. రఘువీరా రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాస్ హేమావతి ఇది వత్తాంతంతో రచించిన నోళంబవాడి పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం మహర్షి వాల్మీకి భవన్‌లో ఆవిష్కరించారు. ప్రముఖ కవి, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రఘువీరాతో పాటు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సుధాకర్, కెటి శ్రీధర్, ఎస్కేయు ప్రొఫెసర్ సదాశివారెడ్డి, కేంద్ర సాహిత్య ఆకాడామి ఆవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి, డాక్టర్ హరినాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘువీరా రెడ్డి మాట్లాడుతు స్థానిక చరిత్రతో ముడిపడిన ఈ పుస్తకాన్ని ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. గతంలో తాము లేపాక్షి, పెనుకొండ ఉత్సవాలు నిర్వహించటంతో వీటి ప్రాముఖ్యత దేశం నలుమూలలకు ప్రాకి నేడు పర్యాటకుల తాకిడి పెరిగిందన్నారు. ఈ సందర్భంగా రచయిత ఒంటేరు శ్రీనివాసులు పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబికా లక్ష్మినారాయణ, పిసిసి ఉపాధ్యక్షులు బాలాజి మనోహర్, ఆదినారాయణ, ధనాపురం వెంకట్రామిరెడ్డి, కాలువ హరిత, ఆశ్వర్థనారాయణరెడ్డి, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, ఎంఇఒ గంగప్ప, రచయిత శాంటి జయ ప్రకాశ్‌తో పాటు కవులు, రచయితలతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైసిపిది అరాచక పాలన : కందికుంట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

ప్రజాశక్తి కదిరి అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు ఈ మేరకు ఆయన ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలు 85శాతం అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు మోసం చేసిన ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నవరత్నాల పేరుతో నవ మోసాలు చేశారని ఎద్దేవా చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సర్వ శిక్ష అభియాన్, అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నాలుగున్నర సంవత్సర కాలంలో ప్రజలకు మభ్యపెట్టి ఇబ్బందులు పెట్టిన విధానాన్ని తెలుసుకొని ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి నాయకులు రాజశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు 25,26 వార్డుల కౌన్సిలర్లు మేడాపురం వెంకటేశ్, రాయపాటి మంజుల, డాక్టర్ సురేశ్ కుమార్, మున్సిపల్ ఆర్వో ఆనంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెర్లకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను కేటాయించాలి

ప్రజాశక్తి కదిరి అర్బన్

సత్యసాయి జిల్లా పరిధిలోని కదిరి నియోజకవర్గం అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ స్థానాలను వడ్డెర్లకు కేటాయించాలని బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకటరమణ వైసిపి అధిష్టానాన్ని కోరారు. మండల పరిధిలోని కుమ్మరవాండ్ల పల్లెలోని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్డెర్లు వైసిపి పక్షాన ఉన్నారన్నారు. వడ్డెర్లకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకట రమణ,బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సంపంగి గోవర్ధన్ కోరారు. ఈసమావేశంలో వడ్డెర సంఘం సీనియర్ నాయకులు సైదాపురం రమణ, అల్లుగుండు నారాయణ స్వామి, జయరాజు, బలపాల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేద్దాం : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : ఇప్పటివరకు చేసిన స్ఫూర్తితోనే రాబోవు రోజుల్లో కూడా బాగా పనిచేసి సవాళ్లను అధిగమించాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పోలీసు సిబ్బందిని కోరారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హలులో జిల్లా పోలీస్ స్పెషల్ బ్రాంచి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో స్పెషల్ బ్రాంచ్ ఎంతో కీలకమైందని ప్రమాదకరమైన సంఘటన విషయాలలో, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల సమయం దగ్గర పడుతోందని, ఈ సమయం పోలీస్ శాఖకి ఎంతో కీలకమైనదని గుర్తు చేశారు. అంతకు ముందు నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు, ఫీల్డ్ సిబ్బంది ఏర్పాటు చేసిన కేకును ఎస్పీ కట్ చేశారు. 2024 సంవత్సర డైరీలను ఎస్పీ చేతుల మీదుగా సిబ్బందికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు జిల్లా అదనపు ఎస్‌పి విష్ణు , స్పెషల్ బ్రాంచ్ సిఐ రవీంద్రారెడ్డి, పుట్టపర్తి సిఐ కొండారెడ్డి ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్, కొత్తచెరువు, బుక్కపట్నం ఎస్ఐలు సురేష్ ,నరసింహులు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

అంగన్వాడీలకు న్యాయం చేయండి



ఓబుళదేవర చెరువులో సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న ఇంతియాజ్



పెనుకొండలో సమ్మె శిబిరం వద్ద అంగన్వాడీల నృత్యం



ధర్మవరంలో సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు స్పందించి వారికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ లో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవటం అన్యాయమన్నారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వానికి చులకన భావం తగదని అన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం ఆగదని హెచ్చరించారు. పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆశీర్వాదమ్మ, కిష్టమ్మ, కమలమ్మ, వరలక్ష్మి, అరుణమ్మ, అనసూయ, సుకన్య, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: అంగన్వాడీల నిరవధిక సమ్మె 20 వ రోజున ఆటపాటలతో నిరసనలు తెలిపారు. ఆదివారం పుట్టపర్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో అంగన్వాడీలు కబడ్డీ ఆట ఆడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇంతియాజ్, ఇఎస్ వెంకటేష్ అంజి, గంగాధర్ ,బాబావలి తో పాటు ప్రాజెక్టు, లీడర్లు అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : 20 వ రోజు సమ్మెలో బాగంగా అంగన్వాడీలు ఆట పాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం తహశీల్దార్ కార్యాలయం ముందు కబడ్డి ఆట ఆడారు. ఈ సందర్భంగా కబడ్డి కబడ్డి అనే కూతకు బదులు మాకు సమానవేతనం ఇవ్వాలి. పిఎఫ్ ఇవ్వాలి అంటూ కూతవేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, సిఐటియు నాయకులు లక్ష్మి నారాయణ, చందు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శోభమ్మ, వనజ, రామతులసి శారద ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. నిరసనలు చేస్తుంటే వాటిని అణచివేసే దోరణికి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పోతక్క, దీనా, మాంచాలినిదేవి, అనిత, క్రిష్ణవేణి, భువనేశ్వరి, లలిత తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలో ఆదివారం అంగన్వాడీ సిబ్బంది సమ్మె చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెలో భాగంగా ఆట పాట కార్యక్రమం ద్వారా నిరసన తెలిపారు. కబడ్డీ, తొక్కుడు బిళ్ల ఆట ఆడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహప్ప, ధనమ్మ, శశికళ, రత్నమ్మ రూప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 20వ రోజు సమ్మెలో భాగంగా పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆటపాట కార్యక్రమం ద్వారా నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ అంగన్వాడీలసమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు ఊతప్ప, తిప్పన్న, హుస్సేన్ సాబ్, మహిళా నాయకురాలు మున్ని, దివ్యభారతి, వర్షిని, జయంతి, రిహానా, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరూత మండలంలోని అంగన్వాడీలు తాశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక దీక్షను ఆదివారం కొనసాగించారు. ఈసందర్భంగా వారు నృత్యాలు చేస్తూ నిరసన తెలిపారు. తమకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : అంగన్వాడీల సమ్మె ఆదివారం కొనసాగింది. శిబిరం వద్ద ఆటపాటలతో నిరసన తెలిపారు. 20 రోజులుగా న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీల సమ్మెకు సిఐటియు నాయకులు నర్సింహులు, జగన్మోహన్ మద్దతు పలికారు.

హిందూపురం : 20రోజులుగా అనేక రూపాల్లో నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం కనికరించకపోతే పోరును మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివారం దీక్షా శిబిరం ముందు అంగన్వాడీలు రోడ్డుపై జగన్ మాస్కులు ధరించి జగన్ జట్టు, అదే విధంగా అంగన్వాడీల జట్టుతో కబడ్డీ ఆడారు. ఈ కార్యక్రమంలో కెపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రజెక్టు కార్యదర్శి లావణ్య, నాయకులు శిరీషా, నాగమ్మతో పాటు పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ర్యాలీ

రొద్దం : పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణకే వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని స్థానిక వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం స్థానిక వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. 'శంకరన్న కావాలి ఉష శ్రీ చరణ్ వద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి నారాయణ రెడ్డి, మారుతీ రెడ్డి రాజారెడ్డి, కలిపి శ్రీనివాసులు,సచివాలయన కన్వీనర్ రావిశేఖర్ రెడ్డి , మండలంలోని సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి కృషి

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో పురాతన దేవాలయ స్థానంలో నూతన దేవాలయాన్ని గ్రామస్తులు నిర్మించ తలపెట్టారు. ఇందులో భాగంగా గర్భగుడి నిర్మాణం పూర్తి కాగా నిధులు సమకూరని దృష్ట్యా ఆలయ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈనేపథ్యంలో దేవాలయ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని సత్యసాయిబాబా బంధువు కొండమ రాజు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. సత్యసాయి బాబా గతంలో ఈ దేవాలయాన్ని నిర్మించి ప్రారంభించారన్నారు. అలాంటి ఆలయ పునర్‌నిర్మాణ పనులు పూర్తి చేయించి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాయర్ హరికృష్ణ, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి, హరి, చంద్ర, బత్తలపల్లి గ్రామానికి చెందిన టీచర్ రాజవర్ధన్ రెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్యామల, నాగభూషణం, ఆంజనేయులు, శ్రీనివాసులు, బత్తలపల్లి వాసులు పాల్గొన్నారు.

జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తచెరువు : కొత్త చెరువులోనే ధర్మవరం రోడ్డులోగల జనసేన పార్టీ కార్యాలయంలో ఆపార్టీ రూపొందించిన 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జనసేన పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచి మాణిక్యం బాబా, జనసేన పార్టీ మండల కన్వీనర్ పూల శివప్రసాద్, టిడిపి, జనసేన నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

మడకశిర : పట్టణంలో జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆవిర్భావం, చేసిన పోరాటాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

కదిరి టౌన్ : మండల పరిధిలోని బూరుగుపల్లి సచివాలయం నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్దారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం అర్హతే ప్రామాణికంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు, పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాయినాథ్ ఆసుపత్రిలో ఆర్థో సేవలు

కదిరి టౌన్ : పట్టణ పరిధిలోని ఆర్ఎస్ రోడ్డు కృష్ణ కాంప్లెక్స్‌లో గల సాయినాథ్ హాస్పిటల్ ఆర్థో బ్రాంచిని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధా రెడ్డి, డాక్టర్ ఉషారాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందజేస్తూ మంచి పేరు తెచ్చుకున్న డాక్టర్ అశ్వర్థ రెడ్డి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కందికుంట' జన్మదిన వేడుకలు

కదిరి టౌన్ : దేశవ్యాప్తంగా నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. అయితే కదిరి నియోజకవర్గంలో మాత్రం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలతో పాటు టిడిపి నాయకులు, కందికుంట అభిమానులు మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ జన్మదిన వేడుకలను కూడా నిర్వహించుకోనున్నారు. జనవరి 1వ తేదీన కందికుంట వెంకటప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఆయా మండలాల ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తో పాటు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడానికి నాయకులు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

రికార్డుల పరిశీలన

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషన్‌ను కదిరి రూరల్ సిఐ వెంకటేశ్వర్లు ఆదివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా పెంచాలన్నారు. అనంతరం ఇస్తేమా స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటనారాయణ, జమేదార్లు పి రామయ్య, తిరుమలరెడ్డి, శ్రీనివాసులు, పోలీసులు శ్రీనివాసులు, బాలాజీ నాయక్, బాషా, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎస్ఐగా మల్లికార్జున్ రెడ్డి

ఓబులదేవరచెరువు : ఉత్తమ ఉద్యోగిగా స్థానిక ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన క్రైమ్ సమావేశంలో ఉత్తమ ఎస్ఐగా ప్రశంశా పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ ఎస్ఐను అభినందించారు.

నిరుపేదలకు భూపంపిణీ చారిత్రాత్మకం

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

భూమిలేని నిరుపేదలకు భూపంపిణీ ద్వారా ప్రభుత్వం చర్యలు చేపట్టడం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాడిమర్రి మండలం దాడితోట పంచాయితీ పరిధిలో భూమిలేని 118మంది రైతులకు 136 ఎకరాలను భూపంపిణీ ద్వారా పట్టాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి శ్రమ చేస్తూ రైతు కూలీలుగా పని చేసేవారికి ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉండి భూపంపిణీ ద్వారా పట్టాలను అందించి యాజమాన్య హక్కులను కల్పించిందన్నారు. ఎంతో పారదర్శకంగా అర్హులకు అందరికి భూమి అందేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతిపక్షాలు పేద వారికి భూమి అందకుండా చే సేందుకు సైందవుల్లాగా అడ్డుపడి కుట్రలు చేశారని విమర్శించారు. ఆ కుట్రలను తిప్పి కొట్టి భూపంపిణీ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

ముదిగుబ్బ మండలం గుంజేపల్లి పంచాయితీ పరిధిలో పలువురు టీడీపీని వీడి వైసిపిలో చేరారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ముదిగుబ్బ ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్యతో పాటు పలువురికి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. క్రిష్ణయ్యతో పాటు నాగభూషణ, రమణారెడ్డి, రమణ, నడిపి ఓబిలేసు, సతీష్, రాజు, బాష, మల్లి, రాఘవేంద్ర, నాగరాజు, నాగోజి, గోపాల్, వెనుగుంట్ల పుల్లయ్య, ఆదిమూల నాగరాజు, నర్సింహులు తదితరులు ఈసందర్భంగా వైసిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, బూశెట్టి రామకష్ణ, గుంజేపల్లి సర్పంచి శివశంకర్. ఎంపీటీసీ నాగప్ప, జేకేపల్లి మనోహర్ రెడ్డి, మల్లేపల్లి మాధవ్ రెడ్డి, బాల భాస్కర్, హరినాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీ వద్ద వాగ్వాదానికి దిగిన దృశ్యం

ముదిగుబ్బలో ఫ్లెక్సీ వివాదం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలో నూతన సంవత్సర సందర్భంగా నాయకులు తమ అభిమానం చాటుకునేందుకు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలు వివాదానికి కారణమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూర్యనారాయణ తెలుగుదేశం పార్టీని గతంలో వీడారు. ఈ నేపథ్యంలో వరదాపురం సూర్యనారాయణ అభిమానులు, మండల నాయకులు మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, తారక రామారావు, లోకేష్ పొటోలతో ఉన్న ఫ్లెక్సీలను మండలకేంద్రంలో కట్టారు. ఇది గమనించిన ముదిగుబ్బ మండల తెలుగుదేశం నాయకులు అభ్యంతరం తెలిపారు. తెలుగుదేశం పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పరిటాల శ్రీరామ్ కొనసాగుతుండగా ఆయనను కాదని మరోపార్టీలో ఉన్న నాయకుడి ఫొటోతో ఎలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తారని గోనుగుంట్ల అభిమానులతో వాగ్వాదానికి దిగారు. తారక రామారావు, చంద్రబాబు, లోకేష్ అభిమానులుగా తాము ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని గోనుగుంట్ల అభిమానులు వారితో వాదనకు దిగారు. దీంతో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రెండు గ్రూపులకు సర్దిచెపాపరు. ఇరువురి ఫ్లెక్సీలు తీయించారు. మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు తారక రామారావు, చంద్రబాబు, లోకేష్ లేని 40 ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన ఇరువైపులా కట్టారు. ఈసందర్భంగా గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు కంటగాని నారాయణస్వామి మాట్లాడుతూ గొడవకు కారకులైన వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు.

ఎమ్మెల్యే ఎస్కార్ట్ వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ: మండలం మలక వేముల క్రాస్ సమీపన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎస్కార్ట్ వాహనం ఢీకొని ఇద్దరు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. ఎమ్మెల్యే ఎస్కార్ట్ వాహనం స్కార్పియో కదిరి వైపునకు వెళుతూ మల్లేపల్లి అడ్డ రోడ్డు నుండి హైవే పైకి వస్తున్న కొండకిందతండాకి చెందిన బాబునాయక్ , పీక్లనాయక్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎస్కార్ట్ స్కార్పియో వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ మేరకు పట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బత్తలపల్లి : నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లి పరిధిలో ఎలాంటి సంఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మద్యం షాపులు, హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు నిర్ణీత సమయాల్లోనే మూసివేయాలన్నారు. రహదారులపై కేక్ కటింగ్లు చేయడం నిషేధమన్నారు. మద్యం మత్తులో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులకు నష్టం చేకూర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బత్తలపల్లి : కురుబ సంఘం రూపొందించిన 2024 క్యాలెండర్‌ను రాజహంస శ్రీనివాస్, బండి వీరానారప్ప ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజహంస శ్రీనివాస్ మాట్లాడుతూ కురుబలు రాజకీయంగా విద్యాపరంగా ఎదగాలని అన్నారు. గ్రామాల్లో ఐకమత్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుబ సామాజికవర్గం నాయకులు పాల్గొన్నారు.

బంజారాలకు అండగా ఉన్నాం : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : వైసిపి ప్రభుత్వం బంజారాలకు అండగా ఉందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బంజారాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. అడిగిన వెంటనే ప్రభుత్వ భూమిని అధికారికంగా 44 సెంట్లు కేటాయించడం హర్షనీయమన్నారు. కరోనా వల్ల కొద్దిగా ఆలస్యమైనా కూడా మంచి స్థలాన్ని బంజారాలకు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ఆ స్థలంలో బంజారాలకు సంబంధించి భవనాలను కానీ, అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి కాని సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోనే కురుబలకు న్యాయం

పెనుకొండ : కురుబలకు అన్ని విధాలుగా న్యాయం జరిగేది తెలుగుదేశం పార్టీలోనే అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో సవితమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేరుకు మాత్రమే కార్పొరేషన్ ఏర్పాటు చేశారని నిధులు మాత్రం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. కురుబలను రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా పైకి తీసుకొచ్చి శక్తివంతంగా జాతిగా తయారు చేసే బాధ్యత టిడిపి తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాధవ నాయుడు, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్, కౌన్సిలర్ గీతా హనుమంతు, ఐటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి మంజునాథ్, చిన్న పోతన్న, డైరెక్టర్ బుసప్ప, వీర చిన్న, సానిపల్లి వెంకటేష్, బొక్సంపల్లి శ్రీనివాసులు, మద్దిలేటి, రాము, శెట్టిపల్లి మంజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ టెస్ట్‌లో కదిరి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభా విద్యార్థులతో మాస్టర్, తదితరులు



ఆరెంజ్ బెల్ట్ అందుకుంటున్న భవిత్ రాయల్

ప్రజాశక్తి కదిరి టౌన్

పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో యునైటెడ్ షోటోఖాన్ కరాటే డో ఇండియా, శ్రీ సత్యసాయి జిల్లా స్టయిల్ ఛీఫ్, కరాటే మాస్టర్ 5 థ్ డాన్ బ్లాక్ బెల్ట్ మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో బెల్ట్‌టెస్ట్‌లు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అఫీషియల్ ఎక్సమినర్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ కరాటే కోచ్ వి.మురళీకృష్ణ రెడ్డి హాజరై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కరాటే నేర్చుకోవటం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కరాటేతో ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం, శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కలర్ బెల్ట్స్, సీనియర్ బ్రౌన్ బెల్ట్ పరీక్షలో మొత్తం 21 విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. అయేష, సఫాన్, ధీరజ్ రెడ్డి, ఫైజాన్ ఎల్లో బెల్ట్‌ను కైవసం చేసుకున్నారు. హారిక, భవిత్ రాయల్, జోషిత ఆరంజ్ బెల్ట్, జశ్విత, మహమ్మద్ ఫహీం, గీతా బ్లూ బెల్ట్‌ను సాధించారు. రబ్బన్, రిహన్, కృష్ణ కీర్తి పర్పుల్ బెల్ట్ దక్కించున్నారు. సీనియర్ బ్రౌన్ బెల్ట్ పరీక్షల్లో వైష్ణవి, సుహాన, హర్షవర్ధన్, మహమ్మద్ కైఫ్ బ్రౌన్ బెల్ట్ ఫోర్త్ డాన్‌ను, హిమవంత్ సాయి 3 థర్డ్ డాన్‌ను, లవన్ కుమార్,దైవీక్, యజ్ఞేష్ సెకెండ్ డాన్‌ను సాధించినారు. ప్రతిభా విద్యార్థులకు మురళీకృష్ణ రెడ్డి చేతుల మీదుగా బెల్ట్‌లను, ప్రశంసాపత్రాలను అందజేశారు. మాస్టర్ షాకిర్ కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే అలైహి వసల్లం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పెనుకొండలో సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు



ధర్మవరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - పెనుకొండ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మునెమ్మ, దివ్యభారతి, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, రిక్షా నర్సింహులు, తిప్పన్న, ముత్యాలు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలో అర్ధ నగ్న ప్రదర్శనతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ, నిరవధిక సమ్మె 6 వ రోజుకు చేరుకుందన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నాగార్జున, గోవిందు, రామయ్య, నరసింహులు, పెద్దన్న, సాయి, నారాయణమ్మ, మారెక్క, సరోజమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపల్ కార్మికుల సమ్మె ఆరవరోజైన ఆదివారం కొనసాగింది. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరుపై సిఐటియు నాయకులు జగన్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి కడుపు మీద కొడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ధర్మవరం టౌన్ : తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘం జిల్లాకార్యదర్శి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 6వ రోజు కొనసాగింది.. ఈ సందర్భంగా కార్మికులు సిఐటియు కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తూ కాలేజీ, కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీసర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి రమణ, పోలా లక్ష్మీనారాయణ, మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెం కటేశులు, చెన్నకేశవులు, లక్ష్మీఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూసి చూడనట్లు వ్యవహరించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందని సిఐటియు, టిడిపి నాయకులు అన్నారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన రాష్ట్ర నిరవధిక సమ్మె ఆరవ రోజులో భాగంగా ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయం ముందు ఉన్నా బైపాస్ రోడ్డులో అర్ధ నగ్న ప్రదర్శనతో దీక్షా శిబిరం వరకు మోకాళ్లతో ర్యాలీ చేపట్టారు. వీరికి టిడిపి కౌన్సిలర్లు, నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, జగదీష్, టిడిపి పట్టణ అధ్యక్షులు, కౌన్సిల్ ప్రతిపక్ష నేత రమేష్‌కుమార్, కౌన్సిలర్లు సతీష్ కుమార్, భారతీ, నాయకులు సుమో సీనా, అమర్నాథ్, దుర్గా నవీన్, నాగేంద్ర, మోతకు పల్లి ఆనంద్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.